క్లుప్తంగా

సుబ్రమణ్యేశ్వరస్వామికి వెండి పడిగె వితరణ



వెండి పడిగె అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలోని వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామికి దాతలు వెండి పడిగె బహూకరించారు. కర్నూలు పట్టణానికి చెందిన ధీరజ్ కృష్ణ కుటుంబ సభ్యులు స్వామి వారికి 625గ్రాముల వెండి పడిగె అందజేశారని ఈఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం దాత కుటుంబ సభ్యులకు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి



భాగ్యరాజును అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

కోడుమూరు రూరల్ : మండల పరిధిలోని అమడగుంట్ల హైస్కూల్ 8వతరగతి విద్యార్థి భాగ్యరాజు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా ఈనెల 5వతేదీన కర్నూలులో జరిగిన క్రికెట్ పోటీల్లో విద్యార్థి భాగ్యరాజు ప్రతిభ చాటాడని, ఈనెల 25నుంచి తూర్పుగోదావరి జిల్లా, అమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. విద్యార్థి భాగ్యరాజుతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మహమ్మద్ రఫీని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో మంగళవారం తహసీల్దార్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న ఏఈఓ హిమబిందు

సి.బెళగల్: మండలంలోని కొండాపురం, ముడుమాల గ్రామాల్లో మంగళవారం ఏఈఓ హిమబిందు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ తదితర విషయాలను ఏఈఓ రైతులకు వివరించారు. వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులు పాటించి పంటలను చీడపురుగుల నుంచి రక్షణ కల్పించుకోవాలని సూచించారు.

తైక్వాండో పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ఓర్వకల్లు: ఇటీవల నంద్యాల జిల్లాలో నిర్వహించిన తైక్వాండో పోటీలలో మండలంలోని నన్నూరు పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌కు చెందిన 28 మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డా. ఏ. మల్లికార్జున ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల తైక్వండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలలో ఎల్లో విభాగం నందు 14 మంది, ఎల్లో-1లో 13 మంది, గ్రీన్-1 విభాగంలో ఒకరు చొప్పున బెల్ట్ గ్రేడింగ్ సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్-2 కాదంబరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

కల్లూరు: బాలల దినోత్సవ సందర్భంగా చిన్నటేకూరు సమీపంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ పేర్కొన్నారు. మంగళవారం స్కూల్ లో ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. జిల్లా ఒలింపిక్ అసో సియేషన్ సహకారంతో పాఠశాల విద్యార్థులకు ఫుట్ బాల్, చెస్, హ్యాండ్ బాల్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, త్రో బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 13న ఫుట్‌బాల్, చెస్ పోటీ లు, 14న హ్యాండ్ బాల్, రైఫిల్ షూటింగ్, త్రో బాల్, వాలీ బాల్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు ట్రోఫీలతో పాటు ప్రోత్సాహ బహుమ తులు అందజేస్తామన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ క్రీడలపై విద్యార్థులు ఆసక్తి కలిగించేలా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

- రాత్రి, పగలు తేడాలేకుండా అమ్మకాలు
- క్వాటర్‌పై రూ.30 అదనంగా వసూళ్లు
- మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్న వైనం
- బహిరంగ ప్రదేశాల్లోనే సేవిస్తున్నా పట్టించుకోని అధికారులు



ప్రధాన రహదారి పక్కనే తాగుతున్న మద్యం ప్రియులు

కర్నూలు (రూరల్) : టీడీపీ కూటమి సర్కార్ మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పెడుతుంది. ప్రతి పల్లెలో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి. కుగ్రామంలోనూ పగలు, తేడా లేకుండా మద్యం అందుబాటులోకి వచ్చేసింది. క్వార్టర్ మీద ఏకంగా రూ. 30 అధికంగా వసూళ్లు చేస్తున్నారు బెల్ట్ నిర్వాహకులు. అదేవిధంగా తెలంగాణా మద్యం అమ్మకాలు సైతం విచ్చలవిడిగా సాగుతున్నాయి. మండల కేంద్రాలే కాదు గ్రామాల్లోనూ ఏపీ, తెలంగాణ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కర్నూలు మండలానికి నాలుగు మద్యం షాపులు కేటాయించింది కూటమి సర్కార్. వెంకాయపల్లె సమీపాన రెండు వైన్ షాపులు, పంచలింగాల గ్రామంలో ఒక్కటి సుంకేసుల డ్యామ్ సమీపాన మరొక వైన్ షాపు ఏర్పాటు అయ్యింది. అయితే పంచలింగాల గ్రామంలో ఏర్పాటు చేసుకున్న వైన్ షాపుపై మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. తెలంగాణ వ్యక్తులకు సంబంధించిన ఈ షాపులో టీడీపీ ఓ నేత పర్సెంటేజీ ఆశించాడు. షాపు యజమానులు కాదనడంతో రాజకీయ బలం చూపాడు. ఇంకేముంది షాపు ఏర్పాటు స్థలం... దేవుడి మాన్యానికి చెందిందని అధికారులు సీజ్ చేశారు. ఇంత వరకు ఈ షాపు విషయం కొలిక్కి రాలేదు. ఇక మిగిలిన షాపుల్లో జోరుగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. అదేవిధంగా కర్నూలు మండలంలో దాదాపుగా 23 గ్రామ పంచాయితీలలో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మద్యం నాణ్యత ఉత్తిదే....

నాణ్యమైన మద్యం సరసమైన ధరలకు అందజేస్తామన్న కూటమి నేతల హామీలు నీటి మూటలుగా మారాయి. నాణ్యమైన మద్యం, ధరల తగ్గింపు ఉత్తిదే అంటూ మద్యం ప్రియులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. రూ.99 క్యాటర్ ఎక్కడ ఉందో తెలయదంటున్నారు మద్యం ప్రియులు. మిగతా బ్రాండ్‌ల విషయంలోనూ ధరలు ఏ మాత్రం తగ్గలేదంటున్నారు. దీంతో తెలంగాణ మద్యానికి డిమాండ్ పెరిగింది. మండల పరిధిలోని దేవమాడ, పూడూరు, పంచలింగాల, గొందిపర్ల, ఈ తాండ్రపాడు, పడిదెంపాడు, నిడ్జూరు గ్రామాల్లో తెలంగాణ మద్యం ఏరులైపారుతుంది. ప్రతి గ్రామంలో మూడు, నాలుగు బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రం పక్కనే ఉండడంతో అలా వెళ్లి ఇలా మద్యం తీసుకొస్తున్నారు ఆయా గ్రామాల ప్రజలు. క్వాటర్‌పై రూ. 40 అదనంగా వసూళ్లు చేస్తున్నారు.

బహిరంగా ప్రదేశాలలో ...

బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవించకూడదన్న నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. వైన్ షాపుల సమీపాల్లో రోడ్డుపైనే మద్యం సేవిస్తున్నా పట్టించుకునే నాథుడు కరుయ్యారు. కర్నూలు మండల పరిధిలోని వెంకాయ సమీపాన సూదిరెడ్డి పల్లె బస్‌స్టాప్ వద్ద ఉన్న వైన్ షాపులు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రత్యేకించి మంగళ, శుక్రవారం మద్యం ప్రియుల రద్దీ ఇంకా ఎక్కువే. ప్రధాన రహదారిపైనే మద్యం ప్రియులు సేవిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. వెంకాయపల్లె నుంచి సూదిరెడ్డిపల్లె వరకు రోడ్డుపై దర్జాగా కూర్చుని మద్యం సేవిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ చౌరస్తా, టోల్ ప్లాజా వద్ద జాతరను తలపిస్తుంటుంది. కర్నూలు నుంచి పెద్దఎత్తున మద్యం ప్రియులు అక్కడికి వెళ్లి ఎంజాయ్ చేస్తుంటారు. ఏపీ మద్యం నాణ్యత లేనందునే తెలంగాణకు వచ్చి తాగుతున్నామని బహిరంగంగానే చెబుతున్నారు మద్యం ప్రియులు.



బెల్టు షాపులను అరికట్టాలి



అధికారుల నిర్లక్ష్యం మూలంగా విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయి. గ్రామాల్లోనూ మద్యం అందుబాటులో ఉన్నందున పేదలు కష్టపడిన సొమ్ము మద్యానికే తగలబెడుతున్నారు. నాణ్యత లేనందున కొందరు అనారోగ్యానికి గురువుతన్నారు. ఎక్సైజ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. బెల్టు షాపులకు మద్యం సప్లయ్ చేసే వైన్స్ షాపులను గుర్తించి లైసెన్స్ రద్దు చేయాలి.

– రాఘవేంద్ర, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, ఉల్చాల గ్రామం

ప్రతి గ్రామంలో బెల్టు షాపులు



ప్రతి గ్రామంలో బెల్టు షాపులు వెలిశాయి. క్వార్టర్‌పై రూ. 30 అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉండడంతో యువత సైతం మద్యానికి బానిసలు అవుతున్నారు. గ్రామంలో మద్యం గొడవలు అధికమయ్యాయి. మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలి. బెల్టు షాపులు లేకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సి అవసరం ఉంది.

– సురేష్, డీవైఎఫ్ఐ మండల నాయకుడు జి.శింగవరం గ్రామం

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

- జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు శాలురెడ్డి



మాట్లాడుతున్న ఏడీఏ శాలురెడ్డి

ఓర్వకల్లు: రబీ పంటలకు ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు అర్హత పొందాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు శాలురెడ్డి రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఓర్వకల్లు రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలురెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగుచేసి, ఈ-క్రాప్ బుకింగ్ చేసిన పంటలకు రుణాలు పొందని రైతులకు ఫసల్ బీమా పథకం వర్తింస్తుందన్నారు. శనగ ఎకరాకు రూ.420లు, వరికి రూ.630, జొన్నకు రూ.279, వేరుశనగకు రూ. 480, ఉల్లికి రూ.1350, అలాగే వాతావరణ బీమాకింద టమాటకు ఎకరానికి రూ.1500 చొప్పున ప్రీమియం చెల్లించాలని వివరించారు. సమావేశంలో ఏఓ సుధాకర్, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఏఈఓలు భాస్కర్, మధు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

18న ఆశా కార్యకర్తల చలో కలెక్టరేట్



డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 18వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరిబాయి చెప్పారు. ఈ మేరకు మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వారు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యేడాది ఫిబ్రవరి 9న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర బృందంతో ప్రభుత్వం చర్చలు జరిపిందని, చర్చలు ఫలించడంతో జీఓ రూపంలో హామీ కూడా ఇచ్చిందన్నారు. ఆ హామీలను అమలు చేయాలని నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటివరకు అమలుచేయక పోవడంతో 18న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, ఉపాధ్యక్షులు లలితమ్మ ఉన్నారు.

ముగిసిన గ్రామ సభలు

పాణ్యం: గత నెల 22వ తేదీన ప్రారంభంమైన గ్రామ సభలు మంగళవారం ముగిశాయి. భూ సమస్యలకు సంబంధించిన మొత్తం 1,433 దరఖాస్తుల వచ్చాయని డీటీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. జాయింట్‌ఎల్‌పీ-396, కొలతల్లో తేడా 401, మ్యూటేషన్ 235, క్లాసిఫికేషన్-377, పేరు మార్పు-13, ఖాతా మార్పు-1 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేశామన్నారు.

నేడు పంచాయతీ అభివృద్ధిపై అవగాహన

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గ్రామాల్లో వివిధ శాఖల ద్వారా చేపట్టే అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.పంచాయతీల అభివృద్ధిని వివవరిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామైక్య సంఘ సభ్యులు, డిజిటల్ సహాయకులు తప్పక హాజరుకావాలని సూచించారు.

యువకుడి అదృశ్యం

కర్నూలు (టౌన్): మూడవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. స్థానిక స్వామిరెడ్డినగర్‌లో ఆటో డ్రైవర్‌గా పనిచేసే దినేష్ ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తండ్రి అంజనేయులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కుమారుడు బంగారుపేటకు చెందిన నీలిషికారి రాజేశ్వరిని ప్రేమించాడని, ఆమెతోపాటు బంధువులపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అదృశ్యమైన యువకుడు 5.5 అడుగుల ఎత్తు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, తెలుపు టీషర్టు వేసుకున్నాడని, ఆనవాలు తెలిస్తే మూడవ పట్టణ పోలీసుస్టేషలో తెలియజేయాలని కోరారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పాణ్యం: గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20తేదీ వరకు నిర్వహిస్తునట్ల గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి హనుమేనాయక్ తెలిపారు. విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ప్రాముఖ్యత, పుస్తక పఠనం, క్రీడలు, బాలికల దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల చరిత్రపై అవగాహన కల్పించడం జరుగుతందన్నారు.

రేపు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

పాణ్యం: ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 14న గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని, ఆర్‌జీఎస్‌ఏ కార్యచరన ప్రణాళిక 2024-25కు సంబధించి ఒక్క రోజు శిక్షణ ఉంటుందన్నారు. మండలస్థాయి అధికారులు 50మంది, ప్రజాప్రతినిధులు, వీఓలులతో కలిపి 53మంది ఈ శిక్షణకు హాజరవుతారని ఎంపీడీ వివరించారు.

గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలి

కల్లూరు: గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అనీమియా మోనిటరింగ్ టూల్‌లో అప్లోడ్ చేయాలని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ భాస్కర్ సూచించారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నాయకల్లు గ్రామంలో జరుగుతున్న సంచార వైద్య కార్యక్రమాన్ని మంగళవారం డీఎం అండ్ హెచ్ఓ తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీకి వచ్చిన రోగులు అందరికీ అవసరమైన రక్త పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ శైలేష్‌కుమార్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

కల్లూరు: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరు అర్బన్ 29, 30వ వార్డులోని శరీన్‌నగర్, గట్టయ్య నగర్, ఉద్యోగనగర్, బాలాజీ నగర్, శారద నగర్ ప్రాంతాల్లో నాయకుడు యేసు అధ్యక్షతన ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సాయిబాబా, హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని వందరోజులు పూర్తయిన ఇసుక మాత్రం తక్కువ ధరకు దొరకడం లేదని, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక పస్తులు ఉంటున్నారన్నారు. కొత్త మద్యం పాలసీని తెచ్చి బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగి ఎక్కడపడితే అక్కడ షాపులు పెట్టి యువతను మద్యానికి బానిసలను చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్, వర్మ, దేవేంద్ర, మోహన్, అలీ బాషా, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీల వసూళ్లను వెంటనే ఆపాలి



ప్రజాపోరు పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో చేస్తున్న వసూళ్లను వెంటనే ఆపాలని సీపీఎం మండల కమిటీ నాయకులు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కోడుమూరులోని సుందరయ్య భవన్‌లో ప్రజాపోరు యాత్ర పోస్టర్లను సీపీఎం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే గోరు చుట్టుపై రోకటి పోటులా కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచడం దారుణమన్నారు. ప్రజాసమస్యలపై ఈనెల 14న అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు లక్ష్మన్న, వీరన్న, మునిస్వామి,రాజు, వెంకటేష్, నాగరాజు, విజయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో...

కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో చేస్తున్న వసూళ్లను ఆపాలంటూ మంగళవారం గూడూరులో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ గతంలో బాదుడే బాదుడు అంటూ దొంగనాటకాలాడిన టీడీపీ ప్రభుత్వం నేడు ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరుతో బాదుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, కోటయ్య, రామాంజినేయులు, మధు, అంజి, మల్లికార్జున, మహేష్, గోపి, లోకేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో వృద్ధురాలికి అస్వస్థత

పాణ్యం: నంద్యాల నుంచి కర్నూల్‌కు వెళ్లే ఆర్డీనరీ ఆర్టీసీ బస్సులో ఓ వృద్ధురాలికి అస్వస్థతకు గురైంది. పాణ్యంలో 108 సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి సమస్య లేదని చెప్పడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాణ్యం బస్టాండ్‌లో వృద్ధురాలిని దింపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూరు మండలం కొంగనపాడు కు చెందిన వృద్ధురాలికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం కుమారుడు నంద్యాలకు తీసుకువచ్చాడు. చికిత్స అనంతనం తిరిగి నంద్యాల-కర్నూలు ఆర్డీనరీ బస్సు ఎక్కారు. అయితే కుమారుడు టిఫిన్ తీసకొచ్చేందుకు వెళ్లగా ఇంతలోనే బస్సు బయలుదేరింది. వృద్ధురాలు ఎలాంటి పలుకులేకుండా ఉండడంతో ప్రయాణికులు కండెక్టర్‌కు చెప్పారు. వృద్ధురాలి నుంచి స్పందనలేకపోవడంతో సొంతంగా కండెక్టరే టికెట్ ఇచ్చారు. పాణ్యం సమీపానికి వచ్చే సమయంలో వృద్ధురాలు సీటు నుంచి కింద పడబోగా ప్రయాణికులు పట్టుకున్నారు. కండక్టర్‌కు చెప్పి పాణ్యం బస్టాండ్ రాగానే వృద్ధురాలిని దింపారు. అక్కడికే 108వాహనాన్ని పిలిపించి వైద్య పరీక్షలు చేయించారు. ఆర్టీసీ అధికారుల సమాచారం మేరకు నంద్యాల బస్టాండ్ నుంచి పాణ్యం చెరుకున్న వృద్ధురాలి కుమారుడు తల్లిని తీసుకెళ్లాడు.

8న వెనుకబడిన జిల్లాల సదస్సు

కడప సెవెన్‌రోడ్స్: అభివృద్ధిలో వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సదస్సు డిసెంబరు 8వ తేదీన వైఎస్సార్ జిల్లాలో నిర్వహించనున్నట్లు ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్షుడు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా విభజన చట్టంలోని కడప స్టీల్ ప్లాంటు నిర్మాణాన్ని ఇప్పటివరకు చేపట్టలేదన్నారు. బడ్జెట్‌లో రూ.25 కోట్లు దీనికి కేటాయించడాన్ని బట్టిచూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. స్టీల్ ప్లాంటు నిర్మాణ బాధ్యత కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కార్‌దేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణం పట్ల చూపుతున్న శ్రద్ధ వెనుకబడిన జిల్లాలపై చూపడం లేదని విమర్శించారు.

ఆర్ఐ కావలెను!



కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం

కర్నూలు(రూరల్): కర్నూలు మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పోస్టు ఖాళీగా ఉంది. 2022 సంవత్సరం డిసెంబర్‌లో మండల ఆర్ఐ, మండల సర్వేయర్‌ను నిడ్జూరు గ్రామ పొలం విషయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆర్ఐ పోస్టు భర్తీ జరగలేదు. దీంతో మండల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఎంతో కీలకం. అయినా దాదాపు రెండు సంవత్సరాల నుంచి ఈ పోస్టు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రం అయిన కర్నూలులో రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేకపోవడం ఏమటని ప్రశ్నిస్తున్నారు. ఆర్ఐ గ్రామ రెవెన్యూ అధికారులనూ పర్యవేక్షిస్తూ మండలంలో భూములకు సంబంధించిన తగాదాలకు సంబంధించి విచారణ నిర్వహించి ఆ అంశాలను తహసీల్దార్‌కు నివేదిక ద్వారా అందజేస్తారు. అలాగే రేషన్ బియ్యం డీలర్ల ఆర్ఐ పర్యవేక్షణలోనే ఉంటారు. నగరంలోని గెస్ట్‌హౌస్ ప్రొటొకాల్ విధులలోనూ ఆర్ఐ కీలకం. కర్నూలు రూరల్ మండలం జనాభా 84,006, మండల ఓటర్లు మునిసిపాలిటీ పరిధి కలుపుకొని 1,05,540 మంది ఉన్నారు. మండల విస్తీర్ణం 81,854 ఎకరాలు. ఆర్ఐ పోస్టు భర్తీ కానందున భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి 340 సి. జాతీయ రహదారి చాలా గ్రామాలలో మీదుగా వెళ్తున్నందున భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నష్టపరిహారం జాబితా తయారు చేయడంలోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి ఆర్ఐ పోస్టును భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.